# పరివర్తనము

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

నగరమునం దంతటను ఈ వార్త ఇట్టే పొక్కిపోయినది. నగరమంతయు నట్టుడికిన ట్టుడికిపోయినది. ఏ యిరువురు పౌరులు కలసికొన్నను, ఏ యిరువు రమ్మలక్కలు ఒక్కచోట చేరినను ఈ వార్తనుగురించి ముచ్చటించువారే, దీని ఫలితమునుగురించి తలపోతలు సేయువారే. పురుషులేమి, స్త్రీలేమి ఎల్లరును ఈ వార్తను విని ముక్కున వ్రేలిడికొని అబ్బురపడువారే. "మహారాజునకు గడుగూర్చు ముద్దులరాణియైన నేమి, ఎంతటి విద్యావతియైనను ఆ విధమున మహారాజు నవమానింప జనునా? జలక్రీడా వినోదవేళనయిన నేమి, నోటి కెంతవచ్చిన నంతయు ననివేయుటయేనా? నోటికి తాళ ముండవలెను. చిన్న పెద్ద తారతమ్య ముండనక్కరలేదా? మర్యాద పాటింపనక్కరలేదా? ఒకవేళ మహారాజునకు సంస్కృతభాష తెలియదే యనుము. అయినను తన కమ్మ తెలియునని మిడిసిపడి యహంకరించి మహారాజు నవమానించి చిన్నబుచ్చుటయేనా? విద్యాసంపన్న మయిన ప్రసిద్ధ రాజవంశముననుండి వచ్చిన తాను తన కొలది యెఱుంగక తన భర్తను - విశేషించి సకలదక్షిణాపథే శ్వరుని, సాతవాహనకుల కలశాబ్ధిచంద్రుని, హాలనరవ రోత్తముని ఆ పగిది నవహేళనము చేయుట కామె మనస కిది తగవా?" అని యందరును చాటునను మాటునను తమరాణి వేదవల్లిచర్యను విమర్శించువారే; భార్యా భర్తలకు సంబంధించిన కేవల సాంసారిక విషయము, తమ కెందుకని యూరకయుండినవా రొక్కరును లేరు. ఎల్లరును రాణి మహారాజును జేసిన యవహేళనము తమ్ము జేసినట్టు భావించువారే. ఆ ప్రజానీకమునకు తమ మహారాజన్న నంతటి యభిమానము. మహారాజు మీద వారికిగల యభిమానమే యౌచితినిగూడ బోద్రోలి వారు రాణి నంత తీవ్రముగ విమర్శించునట్టు చేసినది.

ఎట్లు పొక్కినదో ఈ వార్త?—ఏకాంతమున నందనోద్యాన వనమునందలి శ్రీ కృష్ణలీలా సరో వరమున హాలమహారాజును, అతని ముద్దులరాణి వేద వల్లియు నొండొరులపై జలవిక్షేపము చేసికొనుచు జలక్రీడ నవధరించు వేళ "మహారాజా! మా మోదకైస్తాడయ" (మహారాజా! నన్ను నీటితో గొట్టవద్దు) అని గీర్వాణ భాషను వేడికొన్నదట. సంస్కృతభాషా పరిజ్ఞానము లేని హాల మహారాజు రాణి చెప్పిన దానిలో మోదకముమాట వచ్చుటచేత మోదకములు కావలెననుచున్నదని భ్రమపడి రాణికి వెంటనే వానిని తెప్పించి యిచ్చెనట. అంతట నెకసక్కెముగ విరగబడి నవ్వి రాణి తా నన్నమాట కర్థము చెప్పి, అంతమాత్రమయినను దేవభాష తెలియనందుకు మహారాజు నవహేళనము చేసినదట. ఇక నేమున్నది, ఈ వార్త నగరమంతయు పొక్కి, రాణి పౌరుల తీవ్ర విమర్శనమునకు గురియైనది. రాణి చేసిన యీ యవ హేళనమునకు హాలమహారాజుమనసు చివుక్కుమని చిన్నబుచ్చుకొనుట సహజమే. ఎంతటి ముద్దుల రాణియైనను త న్నారీతిని బరిహసించినపుడు మహారాజు మనసు ఖేదము నొందక ప్రమోదము నందునా? చివరికీ భార్యాభర్తల కలహ మెట్లు పర్యవసించునో యని ప్రజ లాందోళన పడుచుండిరి.

## ౨

మహారాజు సాతవాహన కులరత్న ప్రదీపము హాలుడైనను నిరక్షరకుక్షి కాడు. బాగుగా చదివిన వాడు, పండితుడు, రసజ్ఞుడు, కవిత్వ తత్త్వవిశారదుడు, మహాకవి. అయితే, అతని దంతయు ప్రాకృత భాషా పాండిత్యము. ఆ మహారాజు చెప్పిన కవన మంతయు ప్రాకృతముననే. కానైతే అతడు వేదమతావలంబకుడే, యజ్ఞ యాగాది వేదచోదిత కర్మానురక్తుడే;

కాని సంస్కృతము కంటెను ఆ మహారాజును ప్రాకృత భాషాయోష తన ప్రాకృత విలాసమును జూపి యెక్కువగ నాకర్షించినది. చిన్ననాటి నుండియు ప్రాకృతమున పూర్వకవులు రచియించిన గాథలు. (పద్యములు)అతని హృదయము నెంతో రంజింపజేసినవి. ఆ మహారాజునకు పూర్వకవుల గాథ లెన్నో కంఠస్థముగ వచ్చును. అత డెప్పుడు నేదో యొకటి చదువుచునే యుండును. ఆతడు పట్టాభిషిక్తుడై రాజ్యభారమును వహించిన పిదప రాజకార్యపు తొందరలలో గూడ ఆతని శ్రమ నపనయించి యాతని హృదయమున నుల్లాసానందములను పల్లవింపజేయునది ప్రాకృత కవిత్వమే; ఆతడు ముందు మహారసికుడు, రసజ్ఞ శేఖరుడు అయిన కవిరాజు; ఆతరువాతనే ఆతడు మహారాజు. మహారాజత్వ మతనికి సంప్రదాయానుసారలబ్ధమైన యధికార విభ్రమము; కవిరాజత్వము దైవదత్తమై స్వతస్సిద్ధముగ నలవడిన పుణ్య పరిపాక విశేషము.

హాల మహారాజు రాజధాని ధనకటకమున రాజసభా నికటమున నుండిన విద్యామండపమున ననుదినము విద్యాగోష్ఠి జరుగుచునే యుండెడిది. రసజ్ఞుడును, కవిశేఖరుడును అయిన హాల మహారాజు తాము రచియించిన గాథలు సాదరముగ నాకర్ణించి మెచ్చుకొన్నజాలు ; తమ కృషి యంతయు సార్థకమైనట్టే, తాము తరించినట్టే యన్న భావనతో అనేక విషయములనుండి, దూరస్థములైన పలు దేశములనుండి జానపదులు, కవులు ధనకటక మహానగరమునకు మహారాజ సందర్శనాపేక్ష నరుదెంచువారు. కవిహృదయము తన కృతులను వినిపించి మెప్పునందుటకు సహృదయుడైన రసజ్ఞమూర్తికొఱ కెంత తమకపడుచుండునో! కవిచరితార్థత తన కావ్యకన్యకకు దొరకు పాదకట్నమున గాదు; తన కావ్యరసవిశేషము నాస్వాదించి యానందించు రసికవరేణ్యుని యానంద పారవశ్యముననే యున్నది. మహారసజ్ఞశేఖరునికొఱకు మహాకవి యెట్లో మహాకవికొఱకు మహారసజ్ఞశేఖరుడు నట్లే నిత్యము ప్రతీక్షించుచుందురు. శారీరక సౌఖ్యానందమునకు సుదూరమైన, ఐహికవాంఛల కెడమీని, యట్టి నిరతిశయావ్యయానందమే బ్రహ్మానందము. హాల మహారాజ విద్యామండప మిట్టి నిరతిశయానంద సంఫుల్ల మల్లికాశోభాసముదీర్ణమై వెలుగునిగ్గులతో తురంగలించుచుండెడిది. ఆనా డెవనికైనను మహారాజ దర్శనము దుర్లభమేమో కాని ప్రాకృతభాషాకవుల కది సులభాతిసులభము. అట్టివారికి హాలుడు ముంగొంగు బంగారమే. కవియన్నజాలు మహారాజదర్శనమునకును, విద్యామండప ప్రవేశమునకును అడ్డమాకలు లేవు.

ధనకటకము గొప్ప బౌద్ధవిద్యాపీఠమై పాళీ, ప్రాకృతభాషలకు దోహదమిచ్చినది. ఇక నీ హాలమహారాజు కాలమున నది 'ప్రాకృత' విద్యాసస్యమునకు పంటపొలమే. అది సామాన్యపు బంటయా? గ్రీష్మ, వర్ష, హేమంతములు మూడు ఋతువులను ముక్కారు పంట! ధనకటకము కవిధన కటకమే; ఆనా డది ప్రాకృత కవికీరములకు రసాలకల్పభూరుహమయినది. ధనకటకాగతులు కవులు ఇటు కృష్ణవేణ్ణా కరిగి యా పుణ్యతరంగిణిమీద నొకరు, అటు పచ్చని పంటచేలకు బోయి వాటిమీదను, వాటిని కాపుకాయు తెలుగు పడుచులమీదను నొకరు, పైరుచేలలో పవలెల్ల చెమటోడ్చి పనిచేసి భావిఫలావాప్తి కమాయకపుటానందముతో నిశ్రేణులు నిర్మించుకొనుచు ప్రక్కపల్లెల నివసించు కర్షక దంపతుల మధురజీవనముమీద నొకరు—ఇట్లొక విషయమేమిటి, వారికంటికి గానవచ్చిన ప్రతివిషయమును వారి కవితకు వస్తువే యైనది. రస సౌందర్యస్నిగ్ధమై హృదయమును రంజింపజేయవలెనుగాని కృతి కేవస్తువయిననేమి, రసదృష్టితో జూచువారికి జగమంతయు దివ్యమహాకావ్య సంగ్రథనమే. మానవజీవన మచ్ఛస్వచ్ఛమైన మధురాపగ; దీనినుండి రసార్ద్రములైన కావ్యామృతధారల నుత్పాదించి యెన్నిటినేని వెలయించవచ్చునని గ్రహించినవారు హాలమహారాజునాటి ప్రాకృత కవివతంసములు. వారు రచియించిన శృంగారరసాత్మకములైన రసవత్ఖండ కావ్యము లెన్నెని గలవు. శృంగారరసకావ్య లుబ్ధుడు హాలమహారాజు సేకరించి యుంచిన గాథలే కొన్ని వంద లున్నవి. ఒక్కొక్కగాథ యొక ఖండకావ్యమే. ఆ మహారాజునకే గాథాసంకలనము ఒక వినోదకేళి

రైనది. మహారాజు తానును కవే; తాను రచియించిన గాథలుకూడ దన యాస్థానమునకు వచ్చు కవివరులకు చదివి వినిపించువాడు. ఒక్కొక్క గాథమీద కొంత కొంత గోష్ఠి జరుగుచుండెడిది. విద్యామండపమున నున్నంతకాలము హాలుడు మహారాజు కాడు. అతడు నొక కవే. అదియంతయు నొక మహాకవిసమాజము, అది యొక బ్రహ్మానందదాయకమైన సాహిత్యగోష్ఠి. అహమహమికలతో కవు లొండొరులకు దమ కావ్యములు వినిపింతురు; అందలి గుణావగుణములను నిర్భయముగను, నిస్సందేహముగను వెల్లడింతురు; గోష్ఠిలో ఉత్తమములని నిగ్గుదేలిన గాథలను మహారాజునాజ్ఞానుసార మొక లేఖకుడు భూర్జ పత్రముల మీద చిన్నారి చిరుమువ్వలు చుట్టును మెరయు పసిడి గంటముతో వ్రాయుచుండును. ఉత్తమగాథ యని నిర్ణీతమైన వెనుక దానిని రచియించిన కవిని మహారాజు కార్షాపణములతో, దీనారములతో బహూకరించి సమ్మానించును. మహారాజు రచియించిన గాథ యుత్తమమైన దని నిర్ణీత మయ్యెనా మంగళ తూర్యములు మ్రోగును; కవులందరు లేచి యొక్కుమ్మడిగ "హాల మహారాజు దీర్ఘాయుష్మంతుడై రాజ్య మేలుగాక! కవితాసామ్రాజ్య పట్టభద్రుడై పురందర వైభవముతో వర్ధిల్లుగాక!" అని యాశీర్వదించి యక్షతలు చల్లుదురు.

ఆ హాల మహారాజు కవనమున గల్పించిన యభిరుచివలన నేమో ఆంధ్రదేశము నేటికి నసంఖ్యకవికర్షకజనమునకు ఆలవాలమై కవితకు మాగాణి పొలమయినది. పై నుడివిన వడువున హాల మహారాజు తనకు బూర్వముండిన కవులు, తననాటి, తన యాస్థానమునకు వచ్చిన కవులు, తాను రచియించిన గాథలు రమారమి సప్తశత మేరి వాటిని భూర్జ పత్రముల మీద వ్రాయించి గ్రంథస్థము కావించెను. ఈ గ్రంథమునకు సప్తశతి యని పేరు; ప్రాకృతమున దీనిని 'సత్తసయి' అందురు. ఈ గ్రంథ మిప్పటికి నా మహాకవి రసజ్ఞతను బ్రదర్శించు నక్షర రత్న దీపమై వెలుగొందుచున్నది.

కాలము గడచినకొలది హాల మహారాజునకు కావ్య రసాస్వాదన తృష్ణ యధికమై రాజ్యభారము వంతయు దనకు విశ్వాస పాత్రులైన యమాత్య శిఖామణులు గుణాఢ్య శర్వవర్మలమీద మోపి విద్యా వినోదములలో నిమగ్నుడై తరచుగా విద్యా మండపముననే కవుల గోష్ఠి నుండువాడు.

సచివోత్తము లిరువురును సంస్కృత, ప్రాకృతములను చక్కగా నభ్యసించినవారు; అయినను గుణాఢ్యునికి ప్రాకృతముమీద నున్న యభిమానము సంస్కృతముమీద లేదు. ప్రధానముగ నతడు ప్రాకృత భాషా విశారదుడు; అతనికి దెలియని 'ప్రాకృత' విద్యా రహస్య మేదియు లేదు. హాలమహారాజు ప్రాకృత భాషాభిమానమునకు చాలవరకు గుణాఢ్యప్రెగ్గడే కారణము. ప్రాతస్సంధ్యా సమయములను, సాయంసమయ వేళలను శ్వేతాశ్వములను బూన్చిన యరదము నెక్కి యువరాజు హాలుడు వాహ్యాళి వెడలునప్పుడు మహారాజునానతిని ఒక్కొక్కప్పుడు గుణాఢ్యప్రెగ్గడ కూడ నరుగుట వాడుక. అట్టి ప్రశాంత సమయముల ప్రాకృత గాథలు వినిపించి గుణాఢ్యుడు వాటిలోని కవితాగుణ విశేషములను యువరాజునకు విశదీకరించి చెప్పువాడు. లేబ్రాయ మేమో, హాలుని కీ రీతిని పిన్ననాటనే ప్రాకృతమున్న నభిరుచి గలిగినది.

గుణాఢ్యునికి ప్రతి శర్వవర్మ. శర్వవర్మకు దేవ భాషమీదనున్న యభిమానము ప్రాకృతము మీద లేదు. ప్రధానముగ నతడు గీర్వాణ విద్యాపారంగతుడు. సచివులయినప్పటినుండి మహారాజు ప్రాకృత భాషాభిమానము నింకను దోహదముచేయ గుణాఢ్య ప్రెగ్గడయు, మహారాజును దేవభాషాభిమానిగా జేయ శర్వవర్మయు ననేక విధముల బ్రయత్నించుచుండిరి. ఈ ప్రయత్నము గుణాఢ్య ప్రెగ్గడకు సుకరమును, శర్వవర్మకు దుష్కరము నయినది. పట్టాభిషిక్తు డగునాటికే హాలునకు ప్రాకృతము మీది యభిమాన మధికముగ నుండుటచేత గుణాఢ్యుని దోహదము మహారాజు ప్రాకృతభాషాభిమానాంకురము పెరిగి పెద్దదయి మ్రానుకట్టుటకే తోడ్పడినది.

అదియునుగాక సాతవాహన మహారాజాస్థానము ప్రారంభమునుండియు ప్రాకృతభాష నాదరించినది. హాలమహారాజునకు పూర్వులయిన ఆంధ్ర-సాతవాహన భూవరులందరు ప్రాకృతమునే రాజభాషగ వ్యవహరిం

చిరి; రాజ్యవ్యవహారమునకు సంబంధించిన ప్రత్రములన్ని
యు—అవి దానపత్రములైన నేమి, తదితరము లైన
నేమి--ప్రాకృతముననే యుండెను. అంధ్ర-సాతవాహన
నరపతుల కాలమున అంధ్ర రాజ్యమున ముమ్మరముగ
వ్యాపించిన బౌద్ధమత భాష ప్రాకృతము. అంధ్ర దేశ
మున నా డసంఖ్యాకములుగ వెలసిన బౌద్ధ విహారము
లలో బౌద్ధ గురువులు విద్య లన్నియు ప్రాకృతముననే
బోధించువారు. హాలమహారాజు కూడ తన పూర్వులు
పితృపాదుల యడుగుజాడలలో నడచినవాడే కాని
క్రొత్తగా ప్రాకృతమును దెచ్చి పెట్టినవాడు కాడు.
కాని హాలమహారాజు వేదమతావలంబకుడయినను
అతని పూర్వులు అశ్వమేధ అగ్నిష్టోమాది వివిధ యాగ
ములు చేసి వేదవిద్యా సంపన్నుల నాదరించిన వారై
నను మహారాజాస్థానమున దేవభాషావిశారదుల కంత
కంతకు ఆశ్రయము మృగ్యమగుచున్న దనియు, దేవ
భాషయెడల ననాదర మధికమగుచున్న దనియు
రాజ్యమున గొంతకాలమునుండి యివల గొంత
యలజడి రేగుచున్న మాట వాస్తవము.

మహారాజయినను వేదశాస్త్రజ్ఞుల నసలే
యాదరింపకపోవుట లేదు; కాని ప్రాకృతభాషా
కోవిదుల సంఖ్యతో బోల్చి చూచినపుడు సంస్కృత
పండితుల సంఖ్య లవలేశమును గాదని యంగీకరింపక
తీరదు. ప్రాకృతభాషా కవులతోపాటు గీర్వాణ పండి
తులను గూడ సరిసమానముగా నభిమానించి యాదరిం
చుట రాజ్యక్షేమము ననుసరించి చూచినచో శ్రేయ
స్కరమే కాదు; అవశ్యక మనికూడ మహామంత్రి
శర్వవర్మ మహారాజునకు పెక్కు తడవలు నివేదించెను
గాని మహారా జేమి చేయగలడు? ఎంత ప్రయత్నించి
నను ఆతనికి సంస్కృతభాష ముక్కు మూలములే
తెలియరావయ్యెను; సంస్కృత పండితులకు చేయు
చువచ్చిన దాన సత్కార్యములు శర్వవర్మసలహా
ననుసరించి చేసినవే కాని వారి పాండిత్య విశేషము
నెరిగి చేసినవి కావు. సంస్కృత మా మహారాజునకు
కేవలము పరభాషయే యైనది. నూటికి కోటికి ఏ నాలుగు
ముక్కలో తక్క సంస్కృతభాషా పండితుల సంభా
షణ సుంతయినను ఆ మహారాజునకు బోధపడదయ్యెను.
కళాభిజ్ఞుడును, రసజ్ఞుడు నయిన ఆ కవిశేఖరునకు
ప్రాకృతకవిత్వ మొసగినంత నిరతిశయానంద సుఖమును
ఇతర మేదియు నొసగలేదు. తా నతిసుకరముగ సంస్కృ
తమును నేర్పెదనని శర్వవర్మ ఎన్నిసారులు నివేదించి
నను మహారా జందుల కంగీకరింపలేదు. కాని శర్వవర్మ
తన పట్టు విడువలేదు.

## 3

రాణి వేదవల్లి ధనకటకమునకు వచ్చిననాటినుంచి
శర్వవర్మ ప్రయత్నమునకు గొంత బలము చేకూరినది.
రాణి సంస్కృత విద్యాభిమాని; అంతియకాదు,
సంస్కృతమును జక్కగా నభ్యసించిన విదుషీమణి. తన
తండ్రిది చిన్న రాజ్యమయినను వేదశాస్త్ర పారంగతు
లకు ఆశ్రయ మొసగి పేరుగాంచినది. అంధ్ర రాజా
స్థానమున ప్రాకృత విద్యాగోష్ఠివలెనే యామె పుట్టి
నింటివారి రాజ్యమున శాస్త్రచర్చ లనేకములు. తన
తండ్రి యాస్థానమున నట్టి చర్చలు జరుగునప్పుడు ఆమె
తన తండ్రితోగూడ సభామంటపముననే యుండి వాటి
నవధరించుచుండెడిది. ఆ చర్చల నవబోధము చేసికొన
గల జ్ఞాన మామెకు గలదు. అందువలన నా చర్చలలో
నుభయపక్షములవారును వాద ప్రతివాదములలో యుక్తి
ప్రత్యుక్తులలో జూపు చాతుర్యమున కక్కజపడుచుం
డెడిది. ఆమె స్వయముగా శాస్త్రాధ్యయనము జేయక
పోయినను తన తండ్రియాస్థానమున జరుగుచువచ్చిన
శాస్త్రచర్చలను వినుచువచ్చినందున ఆమెకు బహు
శాస్త్రములను గురించి శ్రుతపాండిత్యము చాల గలదు.
ఆమెకు దెలిసిన కొద్దివిషయమును నిగ్గుప్త మయినది.
సంస్కృత విద్యాగంధ రహితుడైన హాలమహారాజు
పాణిగ్రహణమున కామె మొట్టమొదట సమ్మతింపలేదు.

హాలమహారాజున కైనను లీలావతి మొదలైన
భార్య లింకను గలరు; కాని వేదవల్లి అసమానలావణ్య
రాశి; రూపజితరతీదేవి. వైదేశికు లనేకులవలన ఆమె
సౌందర్య విభ్రమవిలాసములను గురించి విని హాలమహారా
జామె చెట్ట బట్టనెంచి తన రాజ్యపు సీమావధుల నున్న
చిన్న రాజ్యము నేలు నామెతండ్రికి ఆమెను దనకిచ్చి
పరిణయము చేయవలసినదని వార్తనంపెను. ఆమెతండ్రి
హృదయము వేదనాదోధూయమానమయినది. ఈ సంబం
ధము తన కూతురి కంగీకారము లేకపోవుటచేత మొట్ట
మొదట నామెతండ్రియు నందులకు సమ్మతింపలేదు;

కాని, కూతు నిచ్చి పెండ్లి చేయకపోయినచో మహా
రాజయిన హాలుడు ఎక్కడ దండెత్తివచ్చి తన్ను, తన
రాజ్యమును నాశనముచేయునో యన్న భయ మొకటి,
తన రాజ్యము గొప్పదయిన అంధ్రరాజ్యమునకును. ఇత
రములైన పెద్ద రాజ్యములకును నడుమ నుండుటచేత
హాలమహారాజుతో సంబంధము గలుపుకొన్నచో పొరు
గున నున్న పెద్దరాజ్యములవలని యుపద్రవము రాకుండ
అవశ్యకమయినచో నా మహారాజు తనకు దోడ్పడి తన
రాజ్యమును గాపాడగలడను నాశ యొకటి—ఇట్టి
కారణములు చెప్పి మంత్రు లీ వివాహమునకు సమ్మ
తింపవలసినదని యొత్తిడిచేసినపిదప నీ యాలోచనలోని
సామంజస్యమును యోజించి యా మెతండ్రి తుద
కెట్టులో దన కూతు నొడంబరిచి యామెను, హాలమహా
రాజున కిచ్చి మహావైభవముతో వివాహముకావించెను;
అప్పటినుండి యీమె హాలునికి మురిపెములు మూట
గట్టు ముద్దులరాణి యైనది.

తన రాణు లందరిలో హాల మహారా జామె
కిచ్చిన చన వధికము. ఆమె ధనకటకమునకు వచ్చిన
నాటినుండి సంస్కృత భాషా విషయమున దంపతు
లుభయులకు నేకాంతమున వాదోపవాదములు జరగు
చునే యుండెడివి. హాలు డామెకు తన గాథాసప్తశతిని
విప్పి కొన్ని గాథలు వినిపించి రాణిని ప్రాకృత
భాషానురక్త జేయుటకు తాపత్రయ పడుచుండెను;
అ విధముననే రాణియు సంస్కృత విద్యావైభవము
నభివర్ణించి ఆ మహారాజును సంస్కృత భాషాభి
మానిగ జేయ బ్రయత్నించు చుండెను. చివరి కుభయు
లును తీవ్రముగ వాదింతురు; ఉద్రిక్త హృదయు లగు
దురు; మొగములు చిట్లించుకొని చిడుముడి పాటుతో,
విసుగుదలతో నుభయులు నున్నచోటున నుండి వెడలి
పోవుదురు. ఇటీవల నుభయులకు నిట్టి వాదప్రతివా
దములు తరచయినవి; కాని విచిత్ర మేమన, నుభయు
లకు నొండొరుల మీద గల యనురాగ మొక్కవాసి
యు దరుగలేదు; సరికదా వారి ప్రేమానురాగములు
దినదినాభివృద్ధి నందుచునే యుండెను. వా రొకరి
నొకరు విడిచి చాలకాల ముండలేరు; పరస్పరము
గలసికొన్నప్పుడు వాదింపక యూరకుండలేరు. వారిది
విచిత్ర ప్రవృత్తి యైనది.

రాణి వేదవల్లి ధనకటకమునకు వచ్చిన నాటి
నుండి అంధ్ర రాజాస్థానమున కరుదెంచు సంస్కృత
పండితుల సంఖ్య యేకారణముననో పూర్వమున కంటె
నించుక వృద్ధియైనది. మహారాజ దర్శనము గావించు
కొన్న సంస్కృత విద్యార్థికులు రాణి దర్శనము చేయక
వెడలువారు కారు. మహారాజు వలన నల్ప సత్కారము
నంది యసంతృప్తి గన్నవారు రాణిని సందర్శించి
సంతృప్తులై వెడలిపోవుచుండిరి. ఇది శర్వవర్మ కొక
విధమయిన సంతృప్తిని గలిగించినను గుణాఢ్యునికి
మాత్ర మసూయాజనకముగనే యుండెను.

రాణిని విమర్శించు జనమే శర్వవర్మ పైనికూడ
దోషారోపణమునకు దొరకొనిరి. ఎట్లు పుట్టినదో
చెప్పలేము కాని శర్వవర్మ మీద గూడ గొంత ప్రవా
దము పడకపోలేదు. శర్వవర్మ బాసట లేక రాణి
యంతటి సాహసముతోనే కాంత
మున జలకేళి సవరించునప్పుడైనను
మహారాజు నట్లు పరిహసింపగలదా? ఇందెంతో కొంత
శర్వవర్మకుగూడ జోక్య ముండియుండవలెనని ప్రజ
లచ్చటచ్చట నూగ్గడింప జొచ్చిరి; కాని రాణిచర్య శర్వ
వర్మకే ఖేదము కలిగించినదని వా రెరుగరు. కాని యత
డేమి చేయగలడు? ప్రజలు తన్నుగురించి యాడుకొను
మాటలుకూడ శర్వవర్మ యెరుగకపోలేదు. తాను
సంస్కృత భాషాభిమాని యగుటచేత జరిగిన విషయ
మెంతదూరమైన బోవుటకును, ఎట్టి విషఫలితములనైన
సంఘటింప జేయుటకును అవకాశము కలదని యాతడు
బాగుగ నెఱుగును. అందువలన జలక్రీడానంతర రాణి
వాసవిశేషములను, మహారాజుచిత్తవృత్తిని దెలిసికొనుట
కాతడు ప్రయత్నించుచుండెను.

## ౪

రాణి చేసిన పరిహాసము వాడి ములుకువలె
హృదయమునకు గ్రుచ్చుకొని హాలమహారాజును బాధిం
చినది; కాని ధైర్యముతో నా బాధ సహించి మహా
రాజు రాణితో నప్పటి కేవియో నర్మాలాపము లాడి
సంభాషణను మార్చి యేమియు జరుగనట్టు లుచితరీతిని
నటించెను. రాణి పరేంగిత జ్ఞానకుశలయే యైనను ఇప్ప
ట్టున మాత్రము మహారాజు హృదయవేదనను పొడకట్ట
లేకపోయెను. మహారా జంత చతురముగ ప్రవర్తించెను.

జలక్రీడానంతరము మహారాజు రాచనగరికి విచ్చేసి తన యేకాంతమందిరమున కరిగెను. అతని మనస్సునకు కుదురన్నది లేకపోయినది. అతడు మరల మరల నా పరిహాసవాక్యములే తలచుకొనును; ఇంతలో రాణి మీద కోపము వచ్చును. తప్పెవరిదని యాలోచనా నిమగ్నుడగును. రాణి దోషికాదు: తప్పంతయు దనదే; తనమీద నామెకు ప్రేమ; చనవుకొలది నామె తన్నట్లు ఎకసక్కెమాడినది. నిజముగా దేవభాష తెలియని తప్పు తనది; ఆ సంభాషణము హృదయశల్యమగుట యేల? ఉన్నమాట కులుకెందుకు? ఏవో రకరకముల యాలోచనములు- ప్రశ్నలు నతడే వేసికొనును; సమాధానములు నతడే చెప్పుకొనును. వాదియు నతడే, ప్రతివాదియు నతడే; నేరారోపకుడు నతడే, దోష సమర్థకుడు నతడే. మొత్తముమీద అతనికి జలక్రీడనాటిరాత్రి నిద్ర సరిగా పట్టలేదు. మనస్సునకు స్తిమితము లేదు. రాత్రి యంతయు నీ భాషలను గురించిన యాలోచనయే.

ఆ మరునాడుదయమున కాల్యకృత్యములు నిర్వర్తించుకొని పెందలకడనే తన రహస్యాలోచన మందిరమున కరిగెను. తన యమాత్యులు గుణాఢ్య ప్రెగ్గడ, శర్వవర్మల కుభయులకు వార్త నంపెను. అనతికాలముననే మంత్రు లిరువురు వచ్చి మహారాజు ననుజ్ఞ పొంది తమ యాసనముల నుపవిష్టులైరి. మహారాజేమి వచించునో యని మంత్రివరు లుభయులును మహారాజు వైపు నిరీక్షించుచుండిరి.

హాలమహారాజు కడచిన దినమున జరిగిన సంఘటన ప్రస్తావమే చేయలేదు. "ఇంతటినుండి సంస్కృత విద్యనుగూడ నేర్చి యందలి విశేషములను దెలిసికొన కుతూహలము గలిగినది. భారతభూమికి సంస్కృత ప్రాకృతములు రెండు చక్షువులు; వీటిలో నేది కొఱవడినను దృష్టికి లోపమే; మా యమాత్యులీ విషయమును జాలకాలమునుండి యొఱిగించుచున్నను నేటికి గాని యది మా చిత్తమునకు రాలేదు. వేదవిజ్ఞాన వల్లరి కొనలుసాగి నననెత్తినది సంస్కృతసీమనే. వేదకర్మ ప్రవృత్తుడనైన నాకు సంస్కృతము రాకపోవుట గొప్ప లోపమని నాకు నేటికి దెలిసినది. ప్రాకృతమునెడల ఎంత యాదరాభిమానము లున్నను సంస్కృతమును నిరాదరింప నక్కరలేదు. ప్రాకృత కవితారసాస్వాదమునకు సంస్కృత మడ్డురాదు. ప్రాకృతమును భూషించుటకు సంస్కృతమును దూషించ నక్కరలేదు. ధర్మపీఠాధిష్ఠితుడను నా కుభయభాషలును సమానాదరణీయములే. సంస్కృతమున నన్ను మీ రెంతకాలమున బండితుని గావింపగలరు? నేర్చుట కదికష్టమైన భాష యని విందును. దాని నెంతకాలమున నేర్వవచ్చును" అని మహారాజు తన సచివులను ప్రశ్నించెను.

మహారాజువాక్యములు శర్వవర్మ కమృతోపమానము లయినవి. మహారాజు చెప్పు విషయములను తన వీనులచేరలతో జుర్రుచుండెను. ఆ మాటలన్నియు తనవే, వెనుక దాను మహారాజుతో వచించుచు వచ్చినవే; క్రొత్తవి కావు; కాని ఈ నూతన పరిస్థితిలో మహారాజునకీ విషయము తెలియలేదు. అవి యన్నియు తన భావములేయని భ్రమించెను. శర్వవర్మ యుపదేశము మహారాజునకు తెలియకుండగనే అతని మనసున జొచ్చి యట్టి భ్రమ కలుగజేసినది. శర్వవర్మ కృషి ఒక్కనాటిది కాదు; వీలు చూచి సమయము చిక్కినప్పుడెల్ల నట్టి యుపదేశమును మహారాజునకు జేయుచునేయుండెను. ఆ మంత్రిసత్తముని చిరకాలపు కృషి నేటికి ఫలించినది. సంస్కృతము నేర్చినచో మహారాజు ప్రాకృత కవితాధిక్యము నొకరు చెప్పనక్కరలేకయే గ్రహింపగలడిదియు మేలే యని గుణాఢ్యమంత్రి తన్నుదా నాశ్వాసించుకొనెను.

"మహారాజా! మీ రన్నట్లు సంస్కృతము నేర్చుకొనుటకు కొంచెము కష్టమయిన భాషయే. అయిన నేమి, నేర్చుకొనవలయునని వజ్రసంకల్పమున్నచో నవలీలగ నేర్వవచ్చును. సంస్కృతమున బండితుడగుటకు ఆరు సంవత్సరములు చాలు" అని గుణాఢ్యుడు వచించెను.

గుణాఢ్యుని మాటల కడ్డుతగిలి "మహారాజా, సంస్కృతము నేర్చుకొనవలెనను వజ్రసంకల్పమే యున్నచో నాఱు సంవత్సరము లక్కఱలేదు, ఆఱు మాసములు చాలును. సంస్కృతమంత సులువైన భాషయే లేదు. దాని సులువుబరువులు దానిని నేర్పు

గురువులో నున్నవి కాని అసలు భాషలో లేవు" అని శర్వవర్మ వక్కాణించెను.

దానిమీద సంస్కృతభాష నేర్చుటలోను, నేర్పుటలోను గల కష్టసుఖములను గురించి గుణాఢ్య ప్రెగ్గడ శర్వవర్మ లుభయులకును గొప్ప వాగ్వాదము జరిగినది. సంస్కృతమును నేర్చుట, నేర్పుట సులువని శర్వవర్మ, కష్టమని గుణాఢ్య ప్రెగ్గడ. చివరి కీ యుభయుల వాదము ముదిరి పాకమున బడినది. మహారాజును తా నాఱుమాసములలో సంస్కృతమున బండితుని చేయుదునని శర్వవర్మ మరల నుటంకించెను. ఆ విధముగా నాఱు మాసములలో బండితుని గావించినచో తా నికమీద సంస్కృతమును గాని, ప్రాకృతమునుగాని, తుదకు దన స్వభాషనుగాని వాడక తాను వాగ్బంధము గావించుకొని మూగియై యుండెదనని గుణాఢ్యప్రెగ్గడ ఘోరమైన ప్రతిన చేసెను. ఆ ప్రతిన నాలకించి హాల నృపోత్తముడు నిర్విణ్ణుడయ్యెను. అంతటి ఘోర ప్రతిజ్ఞ వలదని మహారాజు గుణాఢ్యుని వారించెను. కాని అతడు వినుతీయలేదు. తా నాడున దొకటి, చేయున దొకటి కాదని అతడు మహారాజునకు విన్నవించెను. "మహారాజును సంస్కృతమున బండితుని గావించుట కాఱుమాసములు చాలును; నాకు పలుకు పంతము లొక్కటియే. నాబాసకు తిరుబాస లే"దని శర్వవర్మ ఘోషించెను. అట్లు చేయలేనిచో మరణమే దండనమని మహారాజు గర్జించెను.

అంతటితో నాసభ ముగిసినది. నాడుమొదలు హాలుడు మరల విద్యార్థి యయ్యెను; శర్వవర్మ యాచార్యుడయ్యెను.

జరిగిన యుదంతమంతయు జనులకు దెలిసి వారు భయవిస్మయపరీతచేతస్కు లయిరి. శర్వవర్మపంతము నెగ్గవలెనని రాణి వాణి నుపాసింప దొడగినది. ఆంధ్ర రాజ్యమంతయు నీ పాడిపంతముల వార్త విని కళవళించిపోయినది. గుణాఢ్యప్రెగ్గడగెలుపు శర్వవర్మకు ప్రాణసంకటము; సంస్కృతమునకు వినాశనము; శర్వవర్మ విజయము గుణాఢ్యునికి పదవీభ్రష్టత; ప్రాకృతమునకుకూడ వినాశకరమా?

౫

ఎంత, ఆఱునెలలు నిట్టె గిర్రున తిరిగిపోయినవి. హాలమహారాజు ఆఱునెలల యనంతరము మహాసభ గావించెను. దేశదేశములనుండి ప్రాకృతభాషలోను, సంస్కృతభాషలోను గొప్పవిద్వాంసులైనవారు సభ కరుదెంచిరి. గుణాఢ్య శర్వవర్మలు మహారాజ సింహాసీకి కిరుప్రక్కల నుచితాసనముల నధివసించిరి. హాల మహారాజు దేవేరులకుగూడ ఆ సభామంటపమున నుచిత స్థలముల నాసనము లేర్పాటుచేయబడినవి. ఆనాడు గీర్వాణభాషాపండితులు, కవులు తమ విద్యాప్రావీణ్యమును జూపుట కనుమతి యీయబడినది. హాలమహారాజే పరీక్షకుడు. అ దొక విచిత్రమైన పరీక్ష. శర్వవర్మ యాచార్యత్వమున మహారా జీయాఱు నెలలలో సంస్కృతమున నెంతటి పాండిత్యమును సంపాదించె నన్న విషయమును బరీక్షించుటకే నిజముగా నీసభ యేర్పాటయినది. పరీక్షలో మహారాజు నెగ్గకపోయినచో నోటమి యాతనిది కాదు, శర్వవర్మది; పరీక్షలో మహారాజు గెలిచినచో గెలుపుకు అతనికి బహూకరణము లేదు; కాని గుణాఢ్యునికి శృంగభంగము: అవమానితు డతడు; ప్రతిజ్ఞ నిర్వహించవలసిన దతడు. సదస్యులు పరీక్షకులు, ధర్మనిర్ణేతలు. ఫలిత మేవిధముగ నుండునో, శర్వవర్మగుణాఢ్యులలో నెవరు గెలుతురో యని సభ యంతయు నుత్కంఠతో నున్నది. ఎల్లరకును గుండెలు దడదడ గొట్టుకొనుచున్నవి. నిశ్చలచిత్తులై కూర్చున్నారు గుణాఢ్య, శర్వవర్మలు.

భరతవిద్యాప్రవీణరైన యొక కోమలాంగి పుష్పాంజలీ విక్షేపము గావించి 'కైవారపదానుసారకమనీయముగా' ప్రావేశికధ్రువాగానము పచరించి, ఆ వెనుక దేశిమార్గభేదంబుల లాస్యతాండవంబులు ప్రస్తరించి నాట్యరహస్యోద్ఘాటనము చేసి, కడపట హాల మహారాజునకు పసిడిపళ్లెరమున అనర్ఘరత్నదీపమహానీరాజన మిచ్చి, మహారాజు నాట్యవిశేషమునకు మెచ్చి యిచ్చిన ముత్యాలహారము నవనతవదనయై కొన్కగా వడసి, విద్యుల్లతికవలె కొలువుకూటమున నుండి యంతర్హితయయ్యెను.

ఆ వెనుక సభ నలంకరించిన గీర్వాణ విద్వత్ప్రకాండులు లేచి నిలబడి ఋగ్వేదమంత్రములతో ఇంద్రావరుణులను, ఆదిత్య చంద్రమసులను, ద్యావా పృథ్వులను సంప్రార్థించి, పిదప సామగానము చేసి హాలమహారాజు నాశీర్వదించి రక్తపుష్పయుక్త హరిద్రాక్షతలను చల్లి తమ యాసనముల నుపవిష్టులైరి. అటుతరువాత ప్రజ్ఞానిధులైన పండితులును, కవులును సంస్కృతమునను, ప్రాకృతమునను ఆశువుగా చెప్పిన గద్యపద్య కావ్యముల హాలమహారాజ గుణగణముల నభివర్ణించిరి. అంతట నా గద్యపద్యములందలి గుణాలంకార విశేషములను గుణించియు, వాటి ప్రాశస్త్యమును గురించియు ప్రమోదావహమైన గోష్ఠి జరిగినది. రసజ్ఞశేఖరుడైన హాలమహారాజు ప్రాకృతముననే కాక సంస్కృతమునగూడ సంభాషించుచు నాగోష్ఠిలో నెక్కువగా పాల్గొనెను. ఆమహారాజు గీర్వాణభాషా వైదుష్యమునకు సభాసదులు ముగ్ధులైరి. శర్వవర్మ ముఖము వికసించెను; గుణాఢ్యుని వదనము ముకుళితమయినది.

మాస షట్కములో మహారాజును గీర్వాణ విద్వాంసునిగ జేసిన మహామంత్రి శర్వవర్మ ప్రజ్ఞాస్యత కక్కజపడినవారే ఎల్లరును; అంతస్వల్పవ్యవధిలో మహారాజు నెట్లు మహాపండితుని జేయగలిగెనని ఎల్లరును విస్మయపడువారే. షణ్ముఖోపాసకుడు శర్వవర్మ, ఆ మహాస్వామియనుగ్రహము వడసి కాతంత్రవ్యాకరణము రచియించి తన్మూలమున మహామంత్రి పంతము సాధించెనని యామహాసభలో రహస్యమా నోటనుండి యాచెవికిని, ఆ చెవినుండి యాచెవికిని ప్రాకినది. ఉపాసనాబలమువలన గాకపోయినచో మహాసముద్రమంత భాషేమిటి, అంతటి యవలీలగ సాధ్యమగుటేమిటి అని సభలోగొంతున గుసగుసలాడినది.

ఇందెంతవరకు సత్యమున్నదో మనకు దెలియదు కాని శర్వవర్మవిరచితమైన కాతంత్ర వ్యాకరణ మిప్పటికి నున్నది. ఆనాటి కది 'యభినవ లఘువ్యాకరణ' మట. ఈ కాతంత్రము చాల ప్రసిద్ధికెక్కిన గ్రంథము. అంతకు పూర్వముండిన సంస్కృత వ్యాకరణము లిది వచ్చిన వెనుక వెనుకబడిపోయినవని ప్రతీతి. నేటికిని తూర్పు బంగాళ దేశమునందును, కాశ్మీర దేశమునను ఈ కాతంత్రవ్యాకరణమునకు ప్రచారము కలదు. నాడు ఉత్తరాదిబౌద్ధులలో ప్రచారమున నుండిన ఇంద్రవ్యాకరణము ననుసరించి శర్వవర్మ ఈ కాతంత్రమును రచియించెనని చెప్పుదురు. సంస్కృత వ్యాకరణ సంప్రదాయములలో ఈ కాతంత్ర సంప్రదాయ మంధ్ర దేశముననే రూపొంది హాలుని నాటినుండి భారతఖండమున పరివ్యాప్తమైన దనుటలో భేదాభిప్రాయములు లేవు.

శర్వవర్మ కుపదేశ మక్కఱలేకయే హాల సాతవాహన నృపాలుడు తన యాస్థానమునకు వచ్చిన గీర్వాణభాషా కవి పండితులకు వారి వారి సామర్థ్య నైపుణ్యములకు దగినట్లు సముచితరీతిని సన్మానించెను. కట్టకడపట నాతడు తన కాచార్యుడైన శర్వవర్మకు గూడ గజతురగ రత్నాంబరాభరణాదులను గురుదక్షిణగ నొసగి సత్కరించి యుత్తరీయమును నడుమున చుట్టుకొని పాదాభివందన మాచరించెను. సదస్యులు జయఘోషతో మహారాజు వినమ్రతను, గురుభక్తిని గొనియాడి సేసలు చల్లిరి. జయజయ వర్ధస్వ, శతాయుష్మాన్ భవ, దీర్ఘాయుష్మాన్ భవ అను ఆశీర్వాక్యములు దిగంతముల మారుమ్రోగినవి. రాణీ వేదవల్లి యానందమునకు మేరలేదు. సంస్కృతభాషానభిజ్ఞతా కళంకదూరుడై హాలమహారాజచంద్రుడు గీర్వాణులకు శివంకరుడయ్యెను. ఆ నాటి మహాసభ పంచమహా వాద్యముల మంగళ ఘోషముతో సదస్యుల ఆశీర్వచన ప్రశంసలతో ముగిసినది. అది సంస్కృతభాషా యోషక ఖండ విజయము. ప్రాకృతభాషాసుందరికో?

ఆమహావిజయోత్సవ ముహూర్తముననే యారంభము గుణాఢ్యప్రెగ్గడ మౌనవ్రతప్రతిజ్ఞా పరిపాలనము. ఇక నాతనికి తావెక్కడ?

## ౬

విజయోత్సవమునాటి రాత్రి గుణాఢ్యప్రెగ్గడను గుణించి యనుకొన్నవారే లేరు. ఆతనినిగురించి విచారించినవారే లేరు. పౌరుల యానందపారవశ్యపు మైకము సాయంసమయ ప్రతీచీదిశా శోభవలె దిగజారి వారికి క్రమముగా జాగృతి కలిగినది. ఇక నామరునాడు—

ఇరువురు తారసిల్లిన జాలు గుణాఢ్య ప్రెగ్గడ ప్రస్తావమే. అతని భవితవ్యము, అతని రాజాశ్రయము, అతని యునికి, అతని మనికి అంతయు నొక పెద్ద ప్రశ్నార్థకము. అతని యోటమితో జనసామాన్యపు సానుభూతియంతయు నతనివైపు ప్రమొగ్గినది. కాని సామాన్యజనము మాత్ర మేమి చేయగలదు? ఎక్కడ, గుణాఢ్య ప్రెగ్గడ ఎక్కడ? అతడు నివసించుచుండిన లోగిలి ఎక్కడ యని ప్రతిధ్వనించినది. అత డున్న బ్రాహ్మణ వాడ ఎక్కడ గుణాఢ్యప్రెగ్గడ యని మారుమ్రోగినది. రాజధానీనగరమంతటను ఇదే ప్రతిధ్వని. ఏడీ? లేడు. గుణాఢ్యప్రెగ్గడ కిక నగరములో తా వేది? అతడు నగరములో లేడు.

దినములు గడచినవి, పక్షము లరిగినవి, మాసములు గతించినవి, సంవత్సరములు గడచిపోయినవి. కాలచక్ర మెంత వడివడిగా నెంతదూరము దొర్లిపోయినదో—ఇప్పుడు ధనకటక మహానగరమున గుణాఢ్య ప్రెగ్గడ విషయము స్మరించువారే లేరు. అటువంటి వ్యక్తి యొకప్పు డుండెనన్న గుర్తే లేదు. అతడు లేని లోపమే కానరాదు. అతడు లేడన్నమాట కాని, ప్రపంచవృత్తి యెప్పటియట్ల గడచిపోవుచున్నది. హాల రాజాస్థానమున సంస్కృతమున కిప్పుడు ప్రాకృతముతో సమానగౌరవాదరములు. క్రమముగా సంస్కృత కవిపండితసమాజము ప్రబలినది; సంస్కృతవాదులదే ఇప్పుడు పైచేయి; సంస్కృతమునకే పట్టాభిషిక్తత. ఒకప్పుడు మహారాజు ప్రాకృతభాషైకజీవి. ఇప్పుడాతడు అధికముగా సంస్కృత కావ్య వినోది. ప్రాకృత కవుల రాకవలనే మహారాజాస్థానమున ప్రాకృత కవితాగోష్ఠియు నల్పస్వల్పమయినది. ఎంతటి మార్పు! ఈ మార్పుతో హాలుడు బ్రహ్మణ్యు డయినాడు; అంధ్రాపథము బ్రహ్మావర్త మయినది. ధన కటకము చతుర్వేదపారగులును, షడ్దర్శనాద్యాది విద్యా విశేషజ్ఞులును, షట్కర్మనిరతులును అయిన యాతాయాత భూసురవ్రాతమునకు ధర్మపథ మయినది. వివిధ శిల్ప చిత్రాలంకార శోభితములైన చైత్యములతో చిహ్నిత మయిన కృష్ణవేణ్ణా నదీతీరము యాగశాలలతోను, యూపస్తంభములతోను అలంకృతమైనది. బౌద్ధుల ప్రాభవము చెన్నుమాయుట కదే మొదలు; ప్రాకృత భాషా సుందరి జీవన పథము కంటకావృత మగుటకును అదే మొదలు. ఎంతటి మార్పు! అంధ్రలోకము నెఱుక లేకయే వచ్చిన మహాపరివర్తన మది. సాజముగనే వచ్చిన ట్లనిపించిన పరివర్తనము. గుణాఢ్యప్రెగ్గడమాట ఇప్పు డెవ్వరికిని స్మృతిపథమున లేదు; క్షీర నీరముల వలె గలసి మెలసియుండిన హాలమహారాజునకే గుణాఢ్య ప్రెగ్గడవిషయము ఇపుడు జ్ఞాపకము లేదు.

౨

గ్రీష్మమును వర్షము, వర్షమును హేమంతము—ఇట్లు ఋతువు లొకదాని నొకటి వెంబడించి తరుముచు చక్రభ్రమణవిధానము ననుసరించి ఎన్నితడవలో గిఱ్ఱున తిరిగిపోయినవి. హేమంత మరిగి మరల గ్రీష్మము ప్రారంభమైనది. ఎవరో ఏదో చదువుచుండ వన్యమృగములు మేత మేయుట మాని యచ్చట గుమికూడి ఆ చదువునది యాత్రముగా నాలకించుచున్నవనియు, తాను చదివిన ఒక్కొక్క యాకును ఆ పాఠకు డగ్నిలో బడవేసి తగులబెట్టుచుండెననియు నగరమునకు చారపప్పు, వెదురుబియ్యము, పుట్టతేనె మొదలైన అడవిని దొరకు వస్తువులను విక్రయమునకు దీసికొని వచ్చు కోదు, కోయ, చెంచు జనము విడ్డూరముగా చెప్పుచుండిరి. ఈ వార్త నగరమంతట ప్రాకినది. ఎల్లరు నిది విని యాశ్చర్యచకితులగువారే. వన్యమృగములకుగూడ రసగ్రహణశక్తి కలదా? గాలిమేపరికి గాన రసమును గ్రహింపగల శక్తి యున్నపుడు అట్టిశక్తి జంతువుల కేల యుండగూడదు? జంతువులకేమి పురాణశ్రవణ కుతూహల మేమి? జంతుజాలమునగూడ అంతటి రసపిపాస నుద్దీపింపజేసిన దదెట్టి గొప్పగ్రంథమో? అట్టి గ్రంథము నడవిలో పఠనము చేయుట యేమి? పఠించిన వెనుక ఆ గ్రంథపత్రములను తగులబెట్టుట యేమి? ఎవరు పఠించువారు? గ్రంథమును రచించినవా రెవరు? ఆ గ్రంథ మేమి? గ్రంథము నగ్నిహోత్రము పాలు సేయుటకా రచించినది? అన్నియు సందేహములే; అంతయు విచిత్రమే.

ఈ విచిత్రవృత్తాంతము రాజప్రాసాదమునగూడ త్రోవచేసికొనినది; మహారాజు హాలునకుగూడ దెలిసినది. ఒకపట్టున మహారాజు దీనిని విశ్వసింపలేకపోయెను. నగరమునకువచ్చు నాటవికజనులను బిలువనంపించెను. స్వయముగ ఈ యుదంతము వారివలన దెలిసికొనెను. అంతయు నిజమే. ఇది యథార్థమని వారు మరల వక్కాణించిరి. విస్మయచకితుడైన మహారాజు ఈ విచిత్ర మేదో కనుగొనవలెనని ఆ వనచరులు త్రోవ చూప వింధ్యాటవి కరిగెను.

ఆ ప్రాంతమున కదివఱ కెన్నడు నామహారాజు రాలేదు; అక్కడ ఒక తెగ జనులు నివసించుచుండిరి. వారు మాటాడు భాష విచిత్రమైనది. హాలమహారాజున కది ప్రాకృతమువలె తోచినది; తా నెఱిగిన ప్రాకృతమునకు సన్నిహితమైనది. ఆ జనుల వన్నియు పైశాచికకృత్యములే. నవ్విన విరగబడి వా రొకచే నవ్వెదగు; వారి శోకము నంతియే. కోపము వచ్చిన వారి కంతయు క్రౌర్యమే. వారి యురుకు వారి చురుకు, వారి చేత వారి వేత—అన్నియు విచిత్రములే, వికృతములే. అది మహారాజునకు పిశాచదేశ మనిపించినది. వారి భాష—పిశాచభాష—ఒక విధమైన ప్రాకృతమా? ఎంతకాలముక్రిందటనో మఱిగిపోయిన ప్రాకృతభాషాస్మృతులు మహారాజు మనసులో మరల మోసులెత్తినవి. ప్రాకృతభాషామాధుర్యము మరల పరిమళించినది; తద్భాషాపరిమళవిలోలములైనవి జిహ్వాశ్రవణేంద్రియములు. సమీపమున ఆ పర్ణకుటీరముముందు ఎండుటాకులు, చితుకులు, కట్టెలు మండి భగ్గురని జ్వాలలు వినువీథి కెగబ్రాకుట మహారాజు చూచెను. శ్రవణపేయముగ వినబడుచున్నది ప్రాకృతగ్రంథపఠనము. ఎన్నాళ్ల కెన్నాళ్లకు వినబడినది ప్రాకృతము! హాలమహారాజులోని ప్రాకృతకవితారసజ్ఞత మరల నింతకాలమునకు మరొకమారు ప్రోత్సారితమైనది. ఎంత సొంపయిన రచన! ఎంత చక్కని కథాసంవిధానము! ఏమి టాగ్రంథము! ఎవ రాప్రాకృతగ్రంథపాఠకుడు? సుపరిచితమైన దా కంఠస్వరము! హాలు డాకంఠస్వరమును గుర్తింప ప్రయత్నించెను. ఆలోచనలో అతని యడుగులకు మాంద్యము కలిగినది. చూచుచుండ మరల నొకమారు భగ్గుభగ్గుమని పైకెగసినది అమంట. చదివిన భూర్జపత్రము లగ్నిలో ఆహుతియైనవి. అదే యామంట పైకెగయుటకు కారణము.

హాలమహారాజుహృదయమున ప్రాకృతకవితాభిమానము మరల జాగరితమైనది. ఎందు కావిధమున ఆపత్రములు నిప్పులో వేసి బూదిసేయుట? ఎవ రాతడు? మహారాజుదగ్గర కరిగెను.

"వద్దువద్దు, తగులబెట్టవద్దు—ఎవరది? గుణాఢ్యుడే, మా గుణాఢ్యుడే?—తగులబెట్టకు తగులబెట్టకు గుణాఢ్యా! ఎంతటి హృదయంగమమైన కథ! ఏమిటది-అట్లు తగులబెట్టుచున్నావు?—" మహారాజ హృదయము శోకముచేత ఉద్రిక్తమయినది.

"మహారాజా! తమకు దయలేకపోయినది. ప్రాకృతభాషాభిమానులు, ప్రాకృత కవితారసజ్ఞులు మీరు ఆదరింపకపోరని రసవత్తమమైన ఈ బృహత్కథాకావ్యమును కొంతకాలముక్రిందట నాశిష్యుల కిచ్చి తమ సన్నిధికి బంపుకొన్నాను. నా దురదృష్టము కాక మరేమి మహారాజా! భాష మొరటుగా నున్నదని చెప్పి తమరు దానిని నిరసించి, స్వీకరించి యాదరింప దిరస్కరించినారట. మౌనవ్రత మవలంబించి తమ రాజ్యమును వదలి, ఈ వింధ్యాటవులకు వచ్చి పిశాచభాష నేర్చి, తాను వరరుచిగురుపాదులవలన విన్న యద్భుతకథను పిశాచికాణభూతి నాకు వినిపింపగా ఆ కథాసంవిధానమునకు పరమాశ్చర్యము నొంది దానిని డెబ్బదిలక్షల గాథల గ్రంథముగా భూర్జపత్రములమీద నా రక్తముతో విలిఖించి తమకడకు పంపినాను. రసజ్ఞశేఖరులు తమరే దీనిని తిరస్కరించినప్పు డిక దీని నాదరించువా రెవరని నిర్వేదము నొంది, ఒకమారు చదువుకొని ఒక్కొకయాకే తగులబెట్టుచున్నాను." అని గుణాఢ్యుడు బాష్పపూరితనేత్రుడై వచించెను.

కొంతకాలముక్రిందట తన యాస్థానమున కిరువురు బ్రాహ్మణబాలకులు వచ్చుట, ఇటువంటి గ్రంథ మేదో చదువుట హాలమహారాజు జ్ఞప్తి కెలయించు

కొని చాల వ్యసనము చెందెను. అప్పటికే అంతటి యద్భుతగ్రంథము బృహత్కథలోని ఆఱుభాగము లగ్నిపాలయి ఖిలమైనందుకు వగచి యా మహారాజు నరవాహనదత్తుని కథగల యేడవభాగముమాత్రము సంరక్షించి దాని కొక టీక వ్రాసి ప్రకటితముచేసెను.

హాలుడు గుణాఢ్యుని దన యాస్థానమునకు రావలసినదని సాదరముగ నాహ్వానించెనుగాని తన జీవితావశేషము నిక తపస్సున గడపనెంచి అత డందుకు సమ్మతింపలేదు. హాలమహారా జందుకు విచారింపగా "అంతయు దైవప్రేరితము, బృహత్కథాగ్రంథ మీమాత్రమైనను లోకమున బ్రవర్తితము కావలసి అన్నియు నీరీతిని జరిగినట్టున్నవి. దేని కేది మూలమో, దేని కేది ఫలమో అల్పజ్ఞులను మన కేమి తెలియును ? విచారింపకుము. అంతయు దైవనిర్ణయము" అని గుణాఢ్యుడు మహారాజును సమాశ్వాసించెను.



పిల్లలను కూర్చోపెట్టడానికి ఎత్తుకుర్చీగానూ, అవసరమైనప్పుడు ఇస్త్రీ బల్లగానూ మార్చడానికి వీలైన ఒక కొత్త పరికరం.